

భక్తులు, వ్యాపారులు వెళ్లిపోవడంతో నిర్మానుష్యంగా జాతర పరిసరాలు


నమస్తే తెలంగాణ

# జనగామ

5 | సోమవారం 26 ఫిబ్రవరి 2024 | JANAGAON


## జై తెలంగాణ అని నినదించడం దేశద్రోహమా..?

**బీఆర్ఎస్ నాయకులను చితక్కొట్టిన పోలీసులు**

పరకాల, ఫిబ్రవరి 25 : జై తెలంగాణ అని నినదించడమే దేశ ద్రోహంగా భావించిన పోలీసులు ఆదివారం తెల్లవారు జామున 3-4 గంటల ప్రాంతంలో కొందరు బీఆర్ఎస్ నాయకులను అక్రమంగా అరెస్టు చేసి చిత్రహింసలకు గురిచేశారు. దామెర, ఆత్మకూరు మండలాల వైస్ ఎంపీపీలు ఎండీ జాకీర్‌అలీ, రేవూరి సుధాకర్‌రెడ్డి, ఆత్మకూరు మండలం అక్కంపేట గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ కూస కుమారస్వామి, రేగుల కిశోర్, పెద్దాపూర్ గ్రామానికి చెందిన వేల్పుల గణేశ్, అగ్రంపహాడ్ గ్రామానికి చెందిన ఆవుల శ్రీనివాస్, వంచ సాంబశివారెడ్డి, గుడెప్పాడ్ గ్రామానికి చెందిన కాంతాల కేశవరెడ్డి, కాంతాల రవీందర్‌రెడ్డి, దామెర మండలం ముస్త్యాలపల్లి గ్రామ మాజీ ఎంపీటీసీ నేరెళ్ల కమలాకర్ పోలీసులు అక్రమంగా అరెస్టు చేసిన వారిలో ఉన్నారు.

# మేడారం ఖాళీ

## బోసిపోతున్న జాతర పరిసరాలు

- నిర్మానుష్యంగా మారిన జంపన్నవాగు.. తిరుగుముఖం పడుతున్న వ్యాపారులు
- అమ్మవార్లను దర్శించుకున్న 4 లక్షల మంది భక్తులు

**నాలుగు రోజుల పాటు మహానగరంగా మారిన మేడారం బోసిపోయింది. జాతర ముగియడంతో ఆదివారం సాయంత్రం భక్తుల రద్దీ తగ్గిపోయింది. వ్యాపారులు దుకాణాలు మూసి తిరుగుముఖం పట్టారు. జంపన్నవాగు నిర్మానుష్యంగా మారింది. దీంతో మేడారం పరిసరాలు ఖాళీగా దర్శనమిస్తున్నాయి. ఉదయం సుమారు నాలుగు లక్షల మంది భక్తులు వన దేవతలను దర్శించుకున్నట్లు దేవాదాయ శాఖ అధికారులు తెలిపారు.**

*- తాడ్వాయి, ఫిబ్రవరి 25*



గద్దెల వద్ద అమ్మవార్లను దర్శించుకుంటున్న భక్తులు

మేడారం జాతరకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. వనం జనంతో మహానగరాన్ని తలపించింది. నాలుగు రోజుల పాటు భక్తులతో కళకళలాడిన మేడారం జాతర పరిసరాలు ఖాళీ అవుతున్నాయి. సమ్మక్క-సారలమ్మ మహాజాతర సందర్భంగా తెలుగు రాష్ట్రాలతోపాటు వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన వ్యాపారులు శివరాంసాగర్, జంపన్నవాగు, చిలుకల గుట్ట, ఆర్టీసీ బస్టాండ్, పలు చోట్ల వ్యాపారాలు ఏర్పాటు చేసుకున్నారు. వ్యాపారులు, భక్తులు లక్షలాది మంది విడిది చేయడంతో ఎటుచూసినా గుడారాలతో నిండిపోయింది. జాతర ముగిసిపోవడంతో వ్యాపారులు ఒక్కొక్కరుగా వెళ్లిపోతుండడంతోపాటు భక్తుల సంఖ్య కూడా తగ్గిపోవడంతో మేడారం పరిసరాలు ఖాళీగా కనిపిస్తున్నాయి. అమ్మవార్లను దర్శించుకునేందుకు వచ్చిన భక్తులతో పాటు వివిధ రకాల వ్యాపారులతో నాలుగు రోజుల పాటు సందడిగా మారిన జాతర పరిసరాలు నిశ్శబ్దంగా మారుతూ మేడారం పాత రూపును సంతరించుకుంటున్నది.

**జాతర ముగిసినా భక్తుల మొక్కులు**

ఆదివారం సెలవుదినం కావడంతో భారీగా జనం తరలివచ్చారు. జంపన్నవాగులో పుణ్యస్నానాలు ఆచరించి అమ్మవార్లను దర్శించుకున్నారు. గిరిజన సంప్రదాయ పద్ధతుల్లో అమ్మవార్లకు పసుపు, కుంకుమ, ఎత్తు బెల్లం, నూతన వస్త్రాలు సమర్పించి, మొక్కులు చెల్లించుకున్నారు. ఆదివారం సుమారు నాలుగు లక్షల మంది భక్తులు అమ్మవార్లను దర్శించుకున్నట్లు దేవాదాయ శాఖ అధికారులు తెలిపారు.

## జాతరలో కీలకంగా మహిళా అధికారులు



జాతరలో భాగంగా చిలుకలగుట్ట వద్ద సమ్మక్క రాక కోసం ఎదురుచూస్తున్న మహిళా అధికారులు, ప్రజాప్రతినిధులు (ఫైల్)


- అన్నీ తామై ఏర్పాట్ల పర్యవేక్షణ
- అమ్మవారి స్ఫూర్తితో విధుల నిర్వహణ
- తల్లుల సేవలో మంత్రులతో పాటు ప్రజాప్రతినిధులు

ములుగు, ఫిబ్రవరి25(నమస్తేతెలంగాణ): మేడారం సమ్మక్క-సారలమ్మల స్ఫూర్తితో 2024 జాతరను విజయవంతం చేయడంలో మహిళా అధికారులు, ప్రజాప్రతినిధులు తమ మార్క్‌ను చాటుకున్నారు. పోరాట స్ఫూర్తికి చిహ్నమైన వీరవనితల జాతరలో 90 శాతం మంది మహిళలు నిర్వహణాధికారులుగా విధులు నిర్వర్తించి భక్తులకు సేవలు అందించారు. జాతర ఏర్పాట్లను మొత్తం తన భుజాలపై వేసుకొని ప్రతి రోజూ స్వయంగా సమీక్షించిన రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ధనసరి అనసూయ(సీతక్క) అత్యంత ప్రధాన పాత్ర పోషించారు. దేవాదాయ శాఖ మంత్రిగా ఉన్న కొండా సురేఖ సైతం అస్వస్థతకు గురైనప్పటికీ తన శాఖ అధికారులతో సమీక్షిస్తూ పలుమార్లు మేడారాన్ని సందర్శించి జాతర ఏర్పాట్లను ఎప్పటికప్పుడు పర్యవేక్షించారు. ములుగు కలెక్టర్ ఇలా త్రిపాఠి గత అనుభవం లేనప్పటికీ ప్రతి విషయంపై ప్రత్యేక శ్రద్ధ చూపించారు. వీరితో పాటు మానుకోట ఎంపీ మాలోత్ కవిత, జడ్పీచైర్‌పర్సన్ బడే నాగజ్యోతి, ఐటీడీఏ పీవో చిత్రా మిశ్రా, అదనపు కలెక్టర్ శ్రీజ, హనుమకొండ అడిషనల్ కలెక్టర్ రాధికాగుప్తా, అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్, ట్రెయినీ కలెక్టర్ శ్రద్ధాశుక్లా, జిల్లా సంక్షేమ అధికారి లెనీనా, డీపీఆర్వోలు బండి పల్లవి, ఈవీ కిరణ్మయి, గిరిజన సంక్షేమ శాఖ కార్యనిర్వాహక ఇంజినీర్లు హేమలత, సమాచార ఇంజినీర్ ఉష, తాడ్వాయి ఎం పీపీ వాణిశ్రీ తదితరులు మేడారంలో సమర్థవంతంగా పనిచేశారు.



ఆత్మకూరు పోలీసులు కొట్టిన బాధితులతో కలిసి మాట్లాడుతున్న స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి, బీఆర్ఎస్ వరంగల్ అధ్యక్షుడు అరూరి రమేశ్, పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి

# రేపు చలో ఆత్మకూరు



ఆత్మకూరు పోలీసులు తీవ్రంగా కొట్టిన గాయాలను చూపిస్తున్న బీఆర్ఎస్ నాయకుడు

## 12 మంది బీఆర్ఎస్ నాయకులపై పోలీసుల ప్రతాపం

- దారుణంగా థర్డ్ డిగ్రీ ప్రయోగం
- ఆత్మకూరు ఎస్సైని వెంటనే సస్పెండ్ చేయాలి
- టాస్క్‌ఫోర్స్ ఆఫీసులో బట్టలిప్పి కొట్టారు
- విచారణ జరిపి ఏసీపీపై చర్యలు తీసుకోవాలి
- ఇందిరమ్మ రాజ్యం అంటే ప్రజలపై దాడులా?
- స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి ధ్వజం

వరంగల్, ఫిబ్రవరి 25 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : ఇందిరమ్మ రాజ్యంలో ప్రజలపై దాడులు మొదలయ్యాయని స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. అగ్రంపహాడ్ జాతర వద్ద ఎలాంటి ఘర్షణ జరగకపోయినా పోలీసులు బీఆర్ఎస్ వాళ్లను ఇష్టమొచ్చినట్లు కొట్టారని అన్నారు. పోలీసు కానిస్టేబుల్‌తో కేసు పెట్టించి హనుమకొండలోని టాస్క్‌ఫోర్స్ ఆఫీసులో 12 మంది బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలపై థర్డ్ డిగ్రీ ప్రయోగించారని చెప్పారు. బీఆర్ఎస్ వాళ్లను కొట్టిన ఆత్మకూరు ఎస్సై ప్రసాద్‌ను వెంటనే సస్పెండ్ చేయాలని, సమగ్ర విచారణ జరిపి ఏసీపీపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వరంగల్ పోలీస్ కమిషనర్ హామీ ఇచ్చిన ప్రకారం 24 గంటల్లో ఎస్సైపై చర్యలు తీసుకోవాలని, లేకుంటే బీఆర్ఎస్ తరఫున తీవ్ర స్పందన ఉంటుందన్నారు. గడువులోపు చర్యలు తీసుకోకుంటే మంగళవారం 'చలో ఆత్మకూరు' నిరసన కార్యక్రమాన్ని నిర్వహిస్తామని చెప్పారు. ఆత్మకూరు పోలీసు స్టేషన్ ఎదుట ధర్నా చేస్తామని హెచ్చరించారు. ఆదివారం హనుమకొండలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆత్మకూరు పోలీసులు కొట్టడంతో గాయాలైన బాధితులు, బీఆర్ఎస్ వరంగల్ జిల్లా అధ్యక్షుడు అరూరి రమేశ్, పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డితో కలిసి కడియం శ్రీహరి మాట్లాడారు. 'పరకాల ఎమ్మెల్యేగా పదేండ్లు అగ్రంపహాడ్ జాతర నిర్వహణ కోసం అనేక అభివృద్ధి పనులు చేసిన చల్లా ధర్మారెడ్డి ముందుగా పరకాల ఏసీపీ, ఆలయ ఈవోకు సమాచారం ఇచ్చి ఈనెల 23న దర్శనానికి వెళ్లారు. ధర్మారెడ్డి అక్కడికి వెళ్లే సమయానికి గేట్లు బంద్ పెట్టారు. ఈవో, ఇతర అధికారులు అందుబాటులో లేకుండా పోయా రు. అక్కడికి భారీగా చేరిన భక్తులు, బీఆర్ఎస్ కార్యకర్తలు కొందరు... జై చల్లా, జై తెలంగాణ అని నినాదాలు చేశారు. దీంతో గేట్లు తీసిన తర్వాత దర్శనం చేసుకుని వచ్చారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ కార్యకర్తల మధ్య ఎలాంటి వాదులాట సైతం జరగలేదు. కొట్లాట, ఘర్షణ అసలే లేదు. ఏమైందో తెలియదు. ఎవరి రాజకీయ ఒత్తిడి కారణమో గానీ, జాతర వద్ద డ్యూటీలో ఉన్న తనను తోసుకుంటూ వెళ్లారని ఆరోపిస్తూ అదే రోజు రాత్రి ఆత్మకూరు పోలీసు స్టేషన్‌లో కానిస్టేబుల్‌తో ఫిర్యాదు చేయించారు. ఐపీసీలోని 143, 149, 353 సెక్షన్లతో 12 మంది బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలపై కేసు పెట్టారు. అవన్నీ స్థానిక పోలీసు స్టేషన్‌లో బెయిల్ ఇచ్చే సెక్షన్లే. ఆదివారం కావడంతో వాళ్లు సోమవారం పోలీస్‌స్టేషన్‌కు వెళ్దామని అనుకున్నారు. ఏసీపీ కిశోర్, సీఐ సంతోష్ ఆదేశాలతో ఎస్సై ప్రసాద్ ఆధ్వర్యంలో శనివారం అర్ధరాత్రి ఆత్మకూరు పోలీసులు 12 మందిని నేరగాండ్ల తరహాలో హనుమకొండలోని టాస్క్‌ఫోర్స్ ఆఫీసుకు తీసుకెళ్లారు. అక్కడ డ్రాయర్ మాత్రమే ఉండేలా అందరితో బట్టలు విప్పించారు. ఒక్కొక్కరిని లోపలికి తీసుకుపోయి బట్టలు లేకుండా ఇష్టం వచ్చినట్లు కొట్టారు. ఐదారుసార్లు ఇలా ఒక్కొక్కరిపై థర్డ్ డిగ్రీ ప్రయోగించారు. రోకలుబండలు ఎక్కించారు. పిరుదులపై బెల్టులతో కొట్టారు. 70 ఏండ్లు దాటిన, ఆరోగ్యం బాగాలేని వారిపై కనీసం కరుణ చూపలేదు. ఎస్సై అశోక్ లోపలి నుంచి బయటికి వచ్చి... అరేయ్ ఫోన్ వచ్చిందిరా, నీపేరే వచ్చింది రారా.. అంటూ ఒక్కొక్కరిని లోపలికి తీసుకుపోయి కొట్టాడు. పోలీసుల దుశ్చర్యపై ఆదివారం ఉదయం వరంగల్ పోలీసు కమిషనర్‌ను కలిసి వివరించాం. కేసు, విచారణ చట్ట ప్రకారం ఉంటాయని, పో లీసులు కొట్టే పరిస్థితి ఉండదని, అలాంటిది జరిగితే తగిన చర్యలు తీసుకుంటామన్నారు. అరెస్టయిన వాళ్లను బెయిల్‌పై తీసుకెళ్లవచ్చని ఈస్ట్ జోన్ డీసీపీ చెప్పారు. ఆ తర్వాత మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి ఆత్మకూరు స్టేషన్‌లో బెయిల్ తీసుకుని వచ్చారు. బయటికి వెళ్లి ఇక్కడ జరిగింది చెబితే ఇంకా దారుణంగా ఉంటుందని పోలీసులు బీఆర్ఎస్ వాళ్లను బెదిరించారు. స్టేషన్ నుంచి వచ్చిన వారు మమ్మల్ని కలిసి జరిగింది వివరించారు. అందరినీ తీసుకుపోయి మళ్లీ వరంగల్ పోలీసు కమిషనర్‌ను కలిసి వివరించాం. కొట్టడం ఎవరు చేసినా తప్పేనని, ఆయన చెప్పిన విషయం గుర్తుచేశాం. ఎస్సైని వెంటనే సస్పెండ్ చేయాలని, విచారణ జరిపి ఏసీపీపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశాం. వరంగల్ పోలీసు కమిషనర్‌కు 24 గంటల గడువు ఇస్తున్నాం. బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలను అన్యాయంగా కొట్టిన పోలీసులపై చర్యలు తీసుకోకపోతే తీవ్రమైన స్పందన ఉంటుంది. వరంగల్ పోలీసు కమిషనర్ తగిన చర్య లు తీసుకోకుంటే హైకోర్టుకు, మానవ హక్కుల కమిషన్‌కు వెళ్తాం. ఈ నెల 27న చలో ఆత్మకూరు నిర్వహిస్తాం. హను మకొండ నుంచి భారీగా తరలివెళ్లి ఆత్మకూరు పోలీసుస్టేషన్ ఎదుట కూర్చుంటాం. పోలీసులు రాజకీయ ప్రేరేపితంగా బీఆర్ఎస్ వాళ్లను కొట్టారు. అన్యాయంగా కొట్టిన, కొట్టించిన ఎస్సై, ఏసీపీపై వెంటనే చర్యలు తీసుకోవాలి. సమగ్రమైన విచారణ జరిపి రాజకీయంగా ఒత్తిడి తెచ్చిన వాళ్ల నిగ్గు తేల్చాలి' అని కడియం అన్నారు.

**రాజకీయ దాడులు : చల్లా ధర్మారెడ్డి**

అగ్రంపహాడ్ జాతర వద్ద బీఆర్ఎస్ నాయకులు, కాంగ్రెస్ వాళ్లకు మధ్య ఎలాంటి వాదులాట జరగలేదని, పోలీసులతోనూ ఎవరూ తప్పుగా వ్యవహరించలేదని పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి అన్నారు. అక్కడ సరిగ్గా ఏం జరిగిందనేది సీసీ కెమెరాలను పరిశీలిస్తే తెలుస్తుందని, వాస్తవాలను ప్రజలకు చూపెట్టాలన్నారు. పోలీసులపై ఒత్తిడి తెచ్చిన రాజకీయ నాయకులు ఎవరో అందరికీ తెలియాలని డిమాండ్ చేశారు. ఆత్మకూరు పోలీసుస్టేషన్‌లో కేసు నమోదైన వారిని హనుమకొండలోని టాస్క్‌ఫోర్స్ ఆఫీసుకు ఎందుకు తీసుకువచ్చారో పోలీసులు వివరణ ఇవ్వాలన్నారు. టాస్క్‌ఫోర్స్ ఆఫీసుల ఆ విభాగం ఏసీపీ, ఇన్‌స్పెక్టర్లు, సిబ్బంది లేనప్పుడు.. పరకాల, ఆత్మకూరు పోలీసు అధికారులు బీఆర్ఎస్ వాళ్లను ఇష్టం వచ్చినట్లుగా కొట్టారని వివరించారు.

### కేయూలో తెలుగు ఆచార్యుల సాహిత్య సేవ

**నేడు, రేపు యూజీసీ జాతీయ సదస్సు**

పోచమ్మమైదాన్, ఫిబ్రవరి 25: కాకతీయ విశ్వవిద్యాలయం తెలుగు ఆచార్యుల సాహిత్య సేవ యూజీసీ జాతీయ సదస్సు కేయూలోని సెనేట్ హాల్ అడ్మినిస్ట్రేటివ్ బిల్డింగ్‌లో ఈనెల 26, 27న నిర్వహించనున్నట్లు సదస్సు సంచాలకులు ఆచార్య బన్న అయిలయ్య ఒక ప్రకటనలో తెలిపారు. 26న సోమవారం ఉదయం 10 గంటలకు ప్రారంభ సమావేశంలో ముఖ్య అతిథిగా వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ తాటికొండ రమేశ్, పూర్వ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ అనుమాండ్ల భూమయ్య, సదస్సు ప్రారంభకులుగా డాక్టర్ మామిడి లింగయ్య, తెలుగు విభాగం విశ్రాంత ఆచార్యులు ప్రొఫెసర్ కోవెల సుప్రసన్నాచార్య, ఆచార్య పేర్వారం జగన్నాథం, డాక్టర్ చిర్ర రాజు, ఆచార్య మాదిరాజు రంగారావు, ఆచార్య కోవెల సంపత్‌కుమారాచార్య, ఆచార్య హరిశివకుమార్ సాహిత్యం, ఉపన్యాసకులుగా ప్రొఫెసర్ కాత్యాయినీ విద్మహే, ప్రొఫెసర్ ఏటూరు జ్యోతి పాల్గొంటారని వివరించారు. 27న మంగళవారం ఉదయం జరిగే కార్యక్రమంలో ఆచార్య పంతంగి వెంకటేశ్వర్లు, ఆచార్య వేలూరి శ్రీదేవి, డాక్టర్ గంగు కిషన్‌ప్రసాద్, ఆచార్య బిరుదురాజు రుక్మిణి సాహిత్యం, సాయంత్రం ముగింపు సమావేశంలో శాతవాహన విశ్వవిద్యాలయం పూర్వ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ ఇక్బాల్ అలీ, యూజీసీ కోఆర్డినేటర్ ప్రొఫెసర్ మల్లికార్జున్‌రెడ్డి, ప్రొఫెసర్ పాకనాటి జ్యోతి, ప్రొఫెసర్ కొంకా యాదగిరి పాల్గొంటారని వివరించారు.

## అధికారుల పనితీరు భేష్

- పంచాయతీరాజ్, స్త్రీ, శిశు సంక్షేమ శాఖల మంత్రి సీతక్క
- జాతర విజయవంతానికి సహకరించిన వారికి సన్మానం



ఈఓ రాజేంద్రంను సన్మానిస్తున్న మంత్రి సీతక్క

తాడ్వాయి, ఫిబ్రవరి25: మేడారం సమ్మక్క, సారలమ్మల మహా జాతర విజయవంతంలో అధికారుల పనితీరు అభినందనీయమని పంచాయతీరాజ్, స్త్రీ, శిశు సంక్షేమ శాఖల మంత్రి సీతక్క అన్నారు. జాతరలో విధులు నిర్వర్తించిన 20 శాఖల అధికారులకు మేడారంలోని అమ్మవార్ల గద్దెల ప్రాంగణంలో ఆదివారం చిరు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఐటీడీఏ పీవో అంకిత్, అదనపు కలెక్టర్లు శ్రీజ, వేణుగోపాల్, డీఎస్పీ రవీందర్‌ను శాలువా, మెమెంటోలతో సత్కరించారు. ఈ సందర్భంగా సీతక్క మాట్లాడుతూ తెలంగాణ కుంభమేళాగా ప్రసిద్ధి చెందిన సమ్మక్క, సారలమ్మల మహా జాతర విజయవంతానికి కృషి చేసిన ప్రతి ఉద్యోగి పనితీరు ప్రశంసనీయమన్నారు. జాతరలో విధులు నిర్వర్తించేందుకు వచ్చిన ఇతర జిల్లాల అధికారులకు కూడా కృతజ్ఞతలు తెలిపారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా అహర్నిశలు పనిచేసిన 20 శాఖల అధికారులు గత జాతరలోని తమ అనుభవాలను దృష్టిలో పెట్టుకొని భక్తులకు అసౌకర్యం కలుగకుండా చూశారని అన్నారు. ఈ జాతరలో అధికారులు తమ అనుభవాలను లేఖ రూపంలో అందించాలని, మరిన్ని మెరుగైన సేవలు అందించడానికి సూచనలు, సలహాలు పాటిస్తామని అన్నారు. వచ్చే జాతర వరకు శాశ్వత సౌకర్యాలు కల్పిస్తామని, జాతర ముగిసినా భక్తుల రాక కొనసాగుతుందని, మేడారం పరిసరాల్లో పారిశుధ్య పనులు ముమ్మరంగా నిర్వహించాలని అన్నారు. అనంతరం జిల్లా అధికారులు సీతక్కను శాలువాతో సత్కరించారు.

## ఇద్దరు యువకుల మృతి

**వాగులో పడి ఒకరు, కెనాల్‌లో పడి మరొకరు..**



ఎండీ జాకీర్, దూడ రఘుతేజ(ఫైల్)

ఖానాపురం/కాశీబుగ్గ, ఫిబ్రవరి 25: పాకాల వాగులో ప్రమాదవశాత్తు పడి యువకుడు మృతి చెందాడు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. వరంగల్ కాశీబుగ్గ 19వ డివిజన్‌కు చెందిన ఎండీ జాకీర్(24) టైర్ల షాపులో పనిచేస్తున్నాడు. ఆదివారం సెలవు కావడంతో విందు చేసుకునేందుకు ఇద్దరు మిత్రులు ఎస్డీ షరన్, చింతల్ బ్రిడ్జి ప్రాంతానికి చెందిన ఎస్‌డీ రెహాన్‌తో కలిసి పాకాలకు వచ్చారు. గిరకతాళ్ల సమీపంలో విందు చేసుకొని, ఈత కొట్టేందుకు సమీపంలోని వాగు వద్దకు వెళ్లారు. ముగ్గురికీ ఈత రాదు. మొదట జాకీర్ తక్కువ లోతు నీళ్లలో దిగాడు. అతడు నిలబడిన రాయి పాకురు పట్టి ఉండడంతో జారి వాగులో పడిపోయి నీళ్లలో మునిగిపోయాడు. స్నేహితులు ఇద్దరు అతడిని కాపాడేందుకు నీళ్లలో దిగి మునిగిపోతుండగా కేకలు వేశారు. వారికి చెట్టుకొమ్మ దొరకడంతో పట్టుకున్నారు. కేకలు విన్న ఆటోడ్రైవర్ మడిపెద్ది రమేశ్, రైతు జంపయ్య ఇద్దరిని బయటకు తీశారు. జాకీర్‌ను రక్షించేందుకు ప్రయత్నించగా అప్పటికే నీట మునిగి మృతి చెందాడు. వారు వెంటనే పోలీసులకు సమాచారం అందించగా అక్కడికి చేరుకుని మృతదేహాన్ని బయటకు తీసి మృతుడి కుటుంబసభ్యులకు తెలియజేశారు. పోస్ట్‌మార్టం కోసం మృతదేహాన్ని నర్సంపేటలోని మార్చురీకి తరలించారు. మృతుడికి తండ్రి ఆటోడ్రైవర్, తల్లి, సోదరుడు ఉన్నారు.

**కెనాల్‌లో పడి మరొకరు..**

ధర్మసాగర్ : మండలంలోని ఎలుకుర్తి గ్రామం దేవాదుల సౌత్ కెనాల్‌లో పడి రఘుతేజ ఆదివారం మృతి చెందాడు. సీఐ విశ్వేశ్వర్ తెలిపిన వివరాల ప్రకారం.. ఉర్సు కరీమాబాద్‌కు చెందిన దూడ రఘుతేజ (26) నర్సింగరావుపల్లె గ్రామంలోని మండల అరుణ్‌కుమార్ ఇంటికి దశదినకర్మకు వచ్చాడు. రఘుతేజ, అరుణ్‌కుమార్, రోహిత్ ఎలుకుర్తి సమీపంలోని దేవాదుల సౌత్ కెనాల్ వద్దకు బహిర్భూమికి వెళ్లారు. కెనాల్‌లోకి దిగుతున్న క్రమంలో ప్రమాదవశాత్తు అందులో పడి రఘుతేజ చనిపోయాడు. మృతదేహాన్ని పోస్టుమా ర్టం కోసం ఎంజీఎం దవాఖానకు తరలించారు.

### ఏఆర్ ఎస్సైపై చేయిచేసుకోవడం సరికాదు

**పోలీస్ అధికారుల సంఘం**

ములుగు రూరల్, ఫిబ్రవరి 25 : మేడారంలో తన భార్యను దైవ దర్శనానికి తీసుకెళ్తున్న ఏఆర్ ఎస్సై రవిని ఐపీఎస్ అధికారి కొట్టడాన్ని తాము తీవ్రంగా ఖండిస్తున్నామని వరంగల్ పోలీస్ అధికారుల సంఘం నాయకులు ఆదివారం సోషల్ మీడియా వేదికగా ఆడియో పోస్టు చేశారు. పోలీస్ శాఖలో చాలా మంది మంచి ఐపీఎస్ అధికారులు ఉంటారని, ఎవరూ పోలీసులపై ఇలా ప్రవర్తించలేదని తెలిపారు. విధుల్లో ఉన్న ఏఆర్ ఎస్సైపై చేయిచేసుకోవడం సరికాదన్నారు. ఎస్సై నుంచి ఎస్పీల వరకు వారి కుటుంబసభ్యులను కానిస్టేబుళ్లు, గన్‌మెన్లు, డ్రైవర్లు దగ్గరుండి దర్శనాలకు తీసుకెళ్లారని, డ్యూటీలో ఉన్న ఏఆర్ ఎస్సై తన భార్యను దర్శనానికి తీసుకెళ్లడం తప్పా? అని ప్రశ్నించారు. అతడి కుటుంబసభ్యుల ముందు కొట్టడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. ఎస్పీపై చర్యలు తీసుకొని ఇలాంటివి మరోసారి జరగకుండా అధికారులు చూడాలని కోరారు.




డీఎఫ్‌ఓకు ఫిర్యాదు చేస్తున్న ఫారెస్ట్ అసోసియేషన్ అధికారులు

## ఎస్పీ గౌష్‌ఆలంపై చర్యలు తీసుకోవాలి

- అటవీ శాఖ అధికారుల డిమాండ్
- విధులు బహిష్కరిస్తామని వెల్లడి

ములుగు రూరల్, ఫిబ్రవరి 25 : విధి నిర్వహణలో ఉన్న ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ శ్రీనివాస్‌పై దాడి చేసిన అదిలాబాద్ ఎస్పీ గౌష్‌ఆలంపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని తెలంగాణ జూనియర్ ఫారెస్ట్ ఆఫీసర్ల అసోసియేషన్ నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం ములుగులో డీఎఫ్‌వో రాహుల్ కిషన్ జాదవ్‌కు ఎస్పీపై ఫిర్యాదు చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ ఈ నెల 23న శ్రీనివాస్ తన భార్యను సమ్మక్క-సారలమ్మ దర్శనానికి మేడారంలో హెలిప్యాడ్ చెక్‌పోస్ట్ ద్వారా తీసుకెళ్తుండగా అక్కడే ఉన్న ఎస్పీ గౌష్‌ఆలం ఆయన యూనిఫామ్ గళ్లా పట్టుకొని పదే పదే లాగుతూ నానా దుర్భాషలాడాడని తెలిపారు. శ్రీనివాస్ భార్య ఎస్పీ కాళ్లు మొక్కి బతిమిలాడినా వినిపించుకోకుండా నెట్టివేసి శ్రీనివాస్‌ను కొట్టాడన్నారు. అటవీ శాఖ ప్రొటోకాల్ వాహనాన్ని కూడా అడ్డగించి స్వల్పంగా ధ్వంసం చేశాడని తెలిపారు. ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ మీద జరిగిన దాడిని ఖండిస్తూ ఎస్పీపై శాఖాపరమైన, చట్ట పరమైన చర్యలు తీసుకోవాలని డీఎఫ్‌వోకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. చర్యలు చేపట్టనట్లయితే న్యాయం జరిగే వరకు విధులు బహిష్కరించనున్నట్లు పేర్కొన్నారు. సమావేశంలో ములుగు యూనిట్ అధ్యక్షుడు శ్రీనివాస్, ఏటూరునాగారం యూనిట్ అధ్యక్షుడు నరేందర్, అటవీ అధికారులు పాల్గొన్నారు.

## నెట్ లేకున్నా..డిజిటల్ బోధన!



పాఠశాలలో ఇంటర్నెట్ లేకుండా డిజిటల్‌లో వస్తున్న పాఠ్యాంశం

శాయంపేట, ఫిబ్రవరి 25 : ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో ఇంటర్నెట్‌తో సంబంధం లేకుండా డిజిటల్ బోధన మొదలైంది. తెలంగాణ విండో యాప్‌తో డిజిటల్ పాఠాలకు శ్రీకారం చుట్టారు. గతంలో కేసీఆర్ సర్కారు 8, 9, 10 తరగతుల విద్యార్థులకు డిజిటల్ పాఠాల బోధనకు ప్రత్యేక స్క్రీన్ బోర్డులను లక్షలాది రూపాయలు వెచ్చించి అందజేసింది. వీటిని అన్ని పాఠశాలల్లో ఇన్‌స్టాల్ చేసి ఆన్‌లైన్ కనెక్టివిటీ లేకున్నా ఓపీఎస్ ద్వారా బోధించేలా ఏర్పాట్లు చేశారు. సిలబస్‌లోని అన్ని అంశాలను క్రోడీకరించి డిజిటల్ రూపంలో బోధించడానికి సాఫ్ట్‌వేర్‌ను అప్‌డేట్ చేశారు. అయితే హిందీ పాఠ్యాంశాలను అందులో బోధించే వీలు లేదు. అయితే ఇప్పటికీ కొన్ని పాఠ్యాంశాలు మాత్రమే అప్‌డేట్ అయ్యాయి. వచ్చే విద్యా సంవత్సరం నుంచి అన్ని పాఠ్యాంశాలు అప్‌డేట్ అవుతాయని, ఇంటర్నెట్ లేకుండా విద్యార్థులకు బోధించవచ్చని టెక్నీషియన్స్ తెలిపారు.